
క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్‌ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



స్కూల్‌కు ఫ్యాన్లు అందజేసిన సన్నీ

దాబాగార్డెన్స్‌ : మోర్చ చిన్నమ్మ మెమోరియల్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ శుక్రవారం అంబేడ్కర్‌ గురుకుల పాఠశాలకు 8 సీలింగ్‌ ఫ్యాన్లు వితరణ చేసింది. ఉత్తమ విద్యనందించిన పాఠశాలకు సేవా కార్యక్రమం నిర్వహించే విషయమై, స్కూల్‌ ప్రిన్సిపాల్‌ రమేష్‌ అభ్యర్థన మేరకు 8 సీలింగ్‌ ఫ్యాన్లు అందజేసినట్లు ట్రస్ట్‌ చైర్మన్‌ సన్యాసిరావు (సన్నీ) తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెసిడెన్షియల్‌ స్కూల్‌లో ఫ్యాన్లు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఫ్యాన్లు అందజేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్‌ రమేష్‌ మాట్లాడుతూ స్కూల్‌ పూర్వ విద్యార్థి సన్నీ ద్వారా రోటరీ క్లబ్‌ యాజమాన్యంతో స్కూల్లో గార్బేజ్‌ తొలగించడం, మంచినీటి సరఫరాకు మోటారు ఏర్పాటు చేయడంతో పాటు పిల్లలకు సంబంధించి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సన్నీ కుటుంబ సభ్యులు, ట్రస్ట్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.

సభా ప్రాంగణం పరిశీలన



సీహార్స్‌ జంక్షన్‌ వద్ద సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌

జగదాంబ : ఈనెల 22న సాధికార బస్సు యాత్ర అనంతరం జరగనున్న సభా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో బస్సు యాత్ర జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్‌ కొల్లి సింహాచలం, ట్రస్టీ బెహరా వెంకటరత్నం, కార్పొరేటర్‌ విల్లూరి భాస్కరరావు, స్టేట్‌ యూత్‌ సెక్రటరీ మాదాబత్తుల రమేష్‌, గోపి, కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ ఉత్సవాలు

సీతంపేట: అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వర ఆలయం ఆధ్వర్యంలో 42వ గౌరీ పరమేశ్వరుల వార్షిక మహోత్సవం జరుగుతోంది. ఈ నెల 11న ప్రారంభమైన ఉత్సవాలు డిసెంబర్‌ 9 వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా మండపంలో ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వరుల విగ్రహానికి ప్రతి రోజూ పూజలు చేస్తున్నారు.



నాగేంద్రునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



శివరామకృష్ణ దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు



ఎల్లమ్మ పుట్ట వద్ద చవితి సందడి

అనంతం వాసుకిం..శేషం పద్మనాభం

- భక్తి శ్రద్ధలతో నాగులచవితి
- ఆలయాలు, పుట్టల వద్ద భక్తుల సందడి

నాగుల చవితి నాడు నాగేంద్రుని శివభావంతో పూజిస్తే సకల రోగాలు నయమవుతాయని భక్తులు నమ్ముతారు. అలాగే మానసిక రుగ్మతలు, చెవి సంబంధిత సమస్యలు, చర్మవ్యాధులు తొలగిపోతాయని ప్రతీతి. ఈ నేపథ్యంలో శుక్రవారం నియోజకవర్గంలోని పలు చోట్ల భక్తులు నాగేంద్రునికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



పోతురాజు పుట్టకు బారులు తీరిన భక్తులు



రైల్వే క్వార్టర్స్‌ పుట్టల వద్ద భక్తుల సందడి



కెప్టెన్‌ రామారావు జంక్షన్‌లో రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి

అల్లిపురం/దాబాగార్డెన్స్‌ : నాగుల చవితి సందర్భంగా రైల్వే క్వార్టర్స్‌లోని పుట్టలు శుక్రవారం కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచి భక్తులు పుట్టల వద్దకు పయనమయ్యారు. నాగదేవతను కొలిచేందుకు పుట్టల వద్ద, దేవాలయాల్లోను బారులు తీరారు. కెప్టెన్‌ రామారావు జంక్షన్‌లో గల రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద పుట్ట భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనానాయుడు, అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, కోశాధికారి వాసుపల్లి నారాయణ, కమిటీ ప్రతినిధులు భక్తుల సౌకర్యార్థం టెంట్లు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

సందడిగా రైల్వే క్వార్టర్స్‌: పుట్టల్లో పాలు పోసేందుకు వచ్చే భక్తులతో రైల్వే క్వార్టర్స్‌లో సందడి నెలకొంది. బెలూన్లు, ఆట వస్తువులతో ఏర్పాటు చేసిన దుకాణాలతో జాతరని తలపించింది. భక్తులు కుటుంబాలతో కలిసి తరలి రావటంతో ఆ ప్రాంతం బంధుమిత్రుల సమేతంగా సందడి నెలకొంది.

శివరామకృష్ణ దేవస్థానంలో.. టూటౌన్‌ దరి శివరామకృష్ణ దేవస్థానంలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి పూజలు చేసి దానాలు చేపట్టారు.

ఎమ్మెల్యే వాసుపల్లి పూజలు..

నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి పుట్టలో పాలు పోశారు. నియోజకవర్గ ప్రజలకు నాగుల చవితి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే వాసుపల్లికి శారదా పీఠాధిపతి ఆశీస్సులు



విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపా నందేంద్ర సరస్వతి మహాస్వామి జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయనను ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ దర్శించుకున్నారు. స్వామీజీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆయన ఆశీస్సులు పొందారు.

ఆకట్టుకున్న బుర్రకథ

అల్లిపురం : వేంకటేశ్వరమెట్టలో శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళం జిల్లా, లావేరు గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ దుర్గ బుర్రకథ బృందంచే ప్రదర్శించిన బాలనాగమ్మ బుర్రకథ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గ్రంథాలయ అధ్యక్షుడు భీశెట్టి శ్రీను తదితరులు కళాకారులను సత్కరించారు.

భక్తులకు ప్రసాదం పంపిణీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న విల్లూరి భాస్కరరావు

జగదాంబ : కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మొదటి శుక్రవారం జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్‌ విల్లూరి భాస్కరరావు ప్రసాదం పంపిణీ చేశారు. శుక్రవారం ఆయన వార్డులో దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి ప్రజలందరికి కార్తీక మాసంలో మంచి జరగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో.. మెరుగైన విజ్ఞానం



రంగసాయి నాటక గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న క్రాంతి తదితరులు



సెయింట్‌ జోసెఫ్‌ కళాశాల గ్రంథాలయలో పుస్తకాలు పరిశీలిస్తున్న అతిథులు



అల్లిపురం శాఖా గ్రంథాలయంలో సభ్యత్వం తీసుకున్న విద్యార్థులతో పీవీఎన్‌ రాజు

సీతమ్మధార : టీఎస్‌ఆర్‌ కాంప్లెక్స్‌లో రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకుడు బాదంగీర్‌ సాయి ఆధ్వర్యంలో జరుగుతున్న పుస్తక ప్రదర్శనకు అఖిలభారత అవినీతి నిరోధక సమాఖ్య ప్రతినిధి బి.క్రాంతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విస్తృతమైన నాటక గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలన్నారు. నిరంతరం నాటకం కోసం పరితపించే సాయిని చూస్తే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకుంటే మెరుగైన విజ్ఞానాన్ని సొంతం చేసుకోవచ్చన్నారు. బాదంగీర్‌ సాయి మాట్లాడుతూ భారత దేశ నాటక రంగ చరిత్రలో తొలి నాటక గ్రంథాలయం తాము ఏర్పాటు చేసిన రంగసాయి నాటక గ్రంథాలయం అన్నారు. ఇక్కడ వందలాది మంది రచయితలు రాసిన సుమారు 11 వేల నాటక, సాహిత్య పుస్తకాలను పొందుపరిచినట్లు తెలిపారు. సాహితీ అభిమానులు, విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించి వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ జగర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్‌ జోసెఫ్‌ కళాశాలలో..

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెయింట్‌ జోసెఫ్‌ మహిళా కళాశాలలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సిస్టర్‌ షైజీ గ్రంథాలయ పితామహుడు డాక్టర్‌ ఎస్‌ఆర్‌ రంగనాథన్‌ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. లెర్నర్స్‌ డెస్టినీ బుక్‌ క్లబ్‌ అధ్వర్యంలో విద్యార్థులకు వక్తృతం, వ్యాసరచన, చిత్రలేఖనం, కవితల పోటీలు నిర్వహించారు. విజేతలకు ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ సిస్టర్‌ హేమ, డాక్టర్‌ పి.కె. జయలక్ష్మి, సిస్టర్లు మేరీ, నాన్సీ, అధ్యాపకులు, లైబ్రరీ సిబ్బంది, క్లబ్‌ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వాల స్వీకరణ..

అల్లిపురం : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం సభ్యత్వాల స్వీకరణ చేపట్టారు. పది మంది విద్యార్థులు సభ్యత్వం తీసుకుని రసీదులు పొందారని గ్రంథాలయాధికారి పీవీఎన్‌ రాజు తెలిపారు.

రైళ్లలో పేలుడు పదార్థాల రవాణా నేరం

డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ సౌరభ్‌ ప్రసాద్‌

తాటిచెట్లపాలెం: ప్రయాణికులు రైళ్లలో ప్రయాణించేటపుడు ఎట్టి పరిస్థితుల్లోనూ పేలుడు, మండే స్వభావం గల పదార్థాలను తమతో తీసుకెళ్లరాదని, ఇది ప్రమాదకరమని, శిక్షార్హమైన నేరమని డివిజనల్‌ రైల్వే మేనేజర్‌ సౌరభ్‌ ప్రసాద్‌ తెలియజేశారు. ఇటీవల కాలంలో రైళ్లలో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా టపాసులు, గ్యాస్‌ సిలిండర్లు, యాసిడ్‌, కిరోసిన్‌, పెట్రోల్‌ వంటి వాటిని రైళ్లు, రైల్వే స్టేషన్లలోనికి తీసుకురావొద్దన్నారు. ఇలా చేసిన వారికి మూడేళ్ల వరకు జైలు, జరిమానా విధించే అవకాశముందని ఆయన చెప్పారు. వీటి వల్ల అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయంలో వాల్తేర్‌ డివిజన్‌ ఆర్పీఎఫ్‌, జీఆర్పీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు సివిల్‌ డిఫెన్స్‌ సభ్యులు, టీటీఈలు, కోచ్‌ అటెండెంట్స్‌, ట్రైన్‌ మేనేజర్లు, స్టేషన్‌ మేనేజర్లు కూడా తరచూ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పేలుడు పదార్థాలు రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటువంటివి గుర్తించిన వారు వెంటనే రైల్వే అధికారులకు, రైళ్లలో ఉండే సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. ప్రయాణికుల సహాయం కోసం 139 నంబర్‌ను సంప్రదించాలని డీఆర్‌ఎం సూచించారు.

ఆర్‌టీఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

మహారాణిపేట : రౌండ్‌ టేబుల్‌ ఇండియా (ఆర్‌టీఐ) వారోత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తాన్ని దానం చేశారు. సంస్థ ఏరియా చైర్మన్‌ టి.విక్రాంత్‌ హనుమంతు, మక్బూద్‌ అహ్మద్‌, సుప్రజ, కమ్యూనిటీ సర్వీస్‌ కన్వీనర్‌ అజిత్‌, సందీప్‌, రెడ్‌క్రాస్‌ చైర్మన్‌ డాక్టర్‌ శివనాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సభ్యులకు బహుమతుల అందజేత



మహిళా సభ్యులకు బహుమతులు అందిస్తున్న డాక్టర్‌ జహీర్‌ అహ్మద్‌

జగదాంబ : స్వామి వివేకానంద సంస్థలో అహర్నిశలు శ్రమిస్తున్న మహిళా సభ్యులకు శుక్రవారం ఆ సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్‌ జహీర్‌ అహ్మద్‌ బహుమతులు అందజేశారు.

భోజనం ప్యాకింగ్‌తో పాటు మరెన్నో విధులు నిర్వర్తిస్తున్న వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రౌండ్‌ టేబుల్‌ సంస్థ సభ్యులు మక్బూద్‌ అహ్మద్‌, సంస్థ అధ్యక్షుడు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలి



కలెక్టర్‌ మల్లికార్జునను సన్మానిస్తున్న డాక్టర్‌ సాయిసునీల్‌కిషోర్‌ తదితరులు

మహారాణిపేట : నెలలు నిండాకుండా పుట్టే పిల్లలకు వైద్యం అందించేందుకు ఆస్పత్రులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్‌ డాక్టర్‌ మల్లికార్జున అన్నారు. శుక్రవారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్‌ ఎరీనాలో మెడికవర్‌ ఉమెన్‌ అండ్‌ చైల్డ్‌ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రపంచ ప్రీ మెచ్యూరిటీ డే సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికవర్‌ యాజమాన్యాన్ని కలెక్టర్‌ అభినందించారు. నెలలు నిండకుండా పుట్టే పిల్లలకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వాటిని ఎదుర్కోవడానికి అన్ని వైద్య పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సెంటర్‌ హెడ్‌ శ్యామలారెడ్డి, వైద్యులు సాయి సునీల్‌ కిషోర్‌, విద్యా రమ, రాధిక, మౌనిక, జి.రమ, అనిత త్రిపాఠి, మాధూరి, విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా అయ్యప్ప స్వామి అంబలం పూజ



అంబలం పూజ నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట : సాలిపేటలో బాల మణికంఠ భక్త బృందం ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి అంబలం పూజ జరిగింది. ప్రసాద్‌ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజలో స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయం నుంచి కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ కోడూరు అప్పలరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకుడు పెంటపల్లి సత్యనారాయణ ,ఇతర నాయకులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాధ

విశాఖ విద్య : జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన బి.రాధ శుక్రవారం కలెక్టర్‌ డాక్టర్‌ ఎ. మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, డీవీఈవోగా బాధ్యతలు చేపట్టినట్లు తెలియజేశారు. వృత్తి విద్య కళాశాలల అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ డాక్టర్‌ మల్లికార్జున సూచించారు.

ఉద్యోగుల స్పందనకు 46 వినతులు



ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో మోహన్‌కుమార్‌

మహారాణిపేట : కలెక్టరేట్‌ ప్రాంగణంలోని డీఆర్వో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగుల స్పందనకు 46 వినతులు వచ్చాయి. జిల్లా, మండల కార్యాలయాల్లో విధుల నిర్వహించే వివిధ క్యాడర్లకు చెందిన ఉద్యోగులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఫిర్యాదులను అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్‌కుమార్‌, ఏవో ఈశ్వరరావు ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. నిర్ణీత కాలంలో వీటికి పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని డీఆర్వో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సౌకర్యార్థం ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల స్పందన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

పోలీస్‌ క్రీడాకారులకు సీపీ అభినందన



అనూరాధను అభినందిస్తున్న సీపీ రవిశంకర్‌

దొండపర్తి : విశాఖలో ఈ నెలలో జరిగిన జిల్లా వెటరన్‌ అథ్లెటిక్స్‌ ఛాంపియన్‌షిప్‌లో నగర పోలీస్‌ శాఖ నుంచి పాల్గొని పతకాలు గెలిచిన సిబ్బందిని సీపీడాక్టర్‌ ఎ.రవిశంకర్‌ అభినందించారు. డిస్కస్‌త్రోలో సీసీఎస్‌ మహిళా ఏఎస్‌ఐ బి.అనూరాధ బంగారం, జావలిన్‌ త్రోలో వెండి పతకాలు సాధించారు. అలాగే త్రీటౌన్‌ మహిళా కానిస్టేబుల్‌ ఎస్‌.జలఉష 5 కిలోమీటర్ల నడకలో గోల్డ్‌, షార్ట్‌పుట్‌లో సిల్వర్‌, పీఎంపాలెం క్రైమ్‌ హెచ్‌సీ ఎం.బాలరాజు షార్ట్‌పుట్‌, ట్రిపుల్‌ జంప్‌లో సిల్వర్‌ మెడల్స్‌ గెలుచుకున్నారు. దీంతో వీరు వచ్చే నెల 9, 10 తేదీల్లో ప్రకాశం జిల్లాలో జరగనున్న 43వ ఏపీ స్టేట్‌ మాస్టర్‌ అథ్లెటిక్స్‌ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించారు. వీరిలో అనూరాధ స్టేట్‌మీట్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్‌ రాష్ట్రంలో ధర్మశాలలో జరగనున్న ఎస్‌బీకేఎఫ్‌ 9వ నేషనల్‌ గేమ్స్‌–2023లో పవర్‌ లిఫ్టింగ్‌(50+) విభాగంలో అర్హత సాధించారు. వీరిని సీపీ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. వీరికి ట్రావెల్‌ ఫండ్‌, డైట్‌ ఫండ్‌ అందజేయాలని అధికారులను ఆదేశించారు.

సిబ్బంది వినతులు పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న సీపీ రవిశంకర్‌

దొండపర్తి : పోలీస్‌ సిబ్బంది సమస్యలు, వినతులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్‌ కమిషనర్‌ డాక్టర్‌ ఎ.రవిశంకర్‌ పోలీస్‌ అధికారులను ఆదేశించారు. పోలీసుల సమస్యల పరిష్కారానికి సీపీ శుక్రవారం తన ఛాంబర్‌లో గ్రీవెన్స్‌ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18 మంది సిబ్బంది తమ సమస్యలు, వినతులు సీపీకి అందజేశారు. ప్రమోషన్లు, క్వార్టర్లు, డిప్యూటేషన్ల వంటి వినతులను సీపీకి అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

అల్లిపురం : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బాలుడు మృతి చెందిన ఘటన మహారాణిపేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సుంకర ప్రవీణ్‌ (17) నగరంలో ఒక విద్యా సంస్థలో చదువుకుంటున్నాడు. గురువారం ఉదయం బీచ్‌ రోడ్డులోని గోకుల్‌ పార్కు నుంచి నేవల్‌ కోస్టల్‌ బ్యాటరీ వద్ద బైకుపై మితిమీరిన వేగంతో రావటంతో బైకు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌ అపస్మారక స్థితికి చేరుకోగా వెనుక కూర్చున అతని స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డాడు. కేజీహెచ్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ప్రవీణ్‌ శుక్రవారం సాయంత్రం మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వచ్చే నెల 17న వైజాగ్‌ మారథాన్‌



టీషర్ట్‌, మెడల్స్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ రవిశంకర్‌, నిర్వాహకులు

విశాఖ స్పోర్ట్స్‌: సాగరతీరంలో డిసెంబర్‌ 17న వైజాగ్‌ మారథాన్‌ జరగనుంది. వైజాగ్‌ రన్నర్స్‌ సొసైటీ ఆధ్వర్యంలో ఈ పరుగు నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నారు. 21 కిలోమీటర్ల పరుగుతో పాటు 10 కి.మీ., 5 కి.మీ., 3 కి.మీ. పరుగు పార్క్‌ హోటల్‌ దరి వైఎస్సార్‌ విగ్రహం చెంత ప్రారంభించి అక్వేరియం, రోప్‌ వే మీదుగా రాడిసన్‌ హోటల్‌ వద్ద టర్న్‌ తీసుకుని తిరిగి వీఎంఆర్డీఏ పార్క్‌ వద్దకు చేరుకోవడంతో ముగియనుంది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నగర పోలీస్‌ కమిషనర్‌ రవిశంకర్‌ మాట్లాడుతూ క్రీడలు జీవితంలో అంతర్భాగంగా చేసుకోవాలన్నారు. వైజాగ్‌ మారథాన్‌ నిర్వాహకులు ఔత్సాహికులకు అందించే టీషర్ట్‌, మెడల్స్‌ను ప్రదర్శించారు. అల్పాహారాన్ని ఔత్సాహికులకు అందిస్తామని, దారి వెంట వైద్య సహాయకులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైజాగ్‌మారథాన్‌.కామ్‌ వెబ్‌సైట్‌ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.